# సాదరంగా సోదరుడితో కలిసి...

నదికి దిగువ పరివాహక ప్రాంతంలో నాగరికత విలసిల్లడం పరిపాటి. నగరీకరణకు దూరంగా గోదారమ్మ లంకల్ని తనలో పొదవుకుంది, అది ఆమె తీరు, తన పచ్చదనాన్ని పంచుతూ పల్లెల్ని వల్లెవాటులా చుట్టుకుంది. మువ్వలపట్టీలా నరసాపురాన్ని, వడ్డాణం లా రాజమహేంద్రినీ, గొలుసు లాకెట్టులా భద్రాద్రిని, కంఠహారంలా బాసరని సింగారించుకున్నా, గోదారి అందమంటే ఆ తల్లి పంట కుచ్చిళ్ళ కదలికల్లోనే. పాయలు గా పారే ఆ కాలవ గట్లమ్మటే, కొబ్బరికి నీరెక్కించే చెరువుల చుట్టూతా.. కొలువైన పల్లెల్లోనే. ఆ అమ్మ ఒడిలోని అలాంటి మాగాణి పల్లెలే చెరుకువాడ, పొలమూరు. ఒకటి నాన్నది, రెండోది అమ్మది. రెంటినీ గుండెల్లో పొదువుకుని బ్రతుకుతెరువుకోసం భీమవరం లో నివసిస్తున్నాడు కలిదిండి వర్మ.

ఓ వేపచెట్టును కొట్టకుండా కాపాడడానికి సర్వం ఒడ్డి ఆఖరి పాచిక గా కవిత్వంలో జారిపడ్డాడు. కవిసంగమంలో కవిత్వం రాస్తూ నా కంటపడ్డాడు, కవితత్వాల చట్రంలో అందరితోపాటూ తన బొమ్మా కట్టాను, మనసారా నవ్వాడు, మాట కలిపాడు, అదే మా గోదారి పలకరింపు.

అది మా మలిపరిచయం. మళ్ళీ అని ఎందుకంటున్నానంటే.. మా నాన్న ఉద్యోగ బదిలీలమీద ఊళ్ళట్టుకు తరలిపోయిన నాకు పాతికేళ్ళ తరువాత నా కుందేళ్ళతో నాతో చిన్నతనంలో కలిసి ఆడుకున్నోడిగా తనే ముందు గుర్తించాడు. 'రాజుల మజ్జిగలో చింతగింజ నానదు' అన్న నానుడి ఉట్టంకించినందుకు ఊరూ పేరూ అడిగి.. మన అమ్మలు అక్కా–చెల్లెళ్ళు అన్నాడు. ఆ వాసూ యే ఈ వర్మ. పుట్టి గోదారిని పంచుకున్నాం, పెరిగి

కవిత్వాన్ని పంచుకున్నాం. మా జీవితాలు వారి ఊహలకు అందని కాలం లోనే మా అమ్మలు స్నేహాన్ని పంచుకున్నారు. ఈ పరంపరకి ఆలంబన గోదారి పారే ఆ నేల, సోదరా అన్న పలకరింపు, నదీమూలం లాంటి యాకూబ్ భయ్యా సాక్షిగా కవిసంగమమూనూ.

వర్మ తెరలు తెరలుగా పల్లె జీవితాన్ని కవిత్వం ద్వారా లోకం కళ్ళకు కడుతున్నాడు. అమ్మ చీరకట్టుకునేటప్పుడు కుచ్చిళ్ళు పెట్టడంలో సాయం చేసిన చిన్నపిల్లాడిలా జీవితం పాదాలవద్ద సాగిలబడి దొంతరులుగా రికార్డ్ చేస్తున్నాడు. అందులో జీవన ప్రవాహం కొనసాగించే తత్వం ఉంది, సనాతనత్వమూ ఉంది. అనుకున్నది జరగకపోతే కుదేలైపోయే జగాన్ని నిలబెట్టే పునాది ఉంది.

నెచ్చెలి ఒంటరిని చేసిపోతే వ్యవసాయం చేసుకునైనా బ్రతికేస్తా అంటాడు ఒక కవితలో. వ్యవసాయం చెయ్యలేక చేతులెత్తేసే రైతన్న కాళ్ళా – వేళ్ళా పడి మరీ కలో, గంజో తాగైనా భూమినీ, మమ్మల్నీ బ్రతికించమని వేడుకుంటున్నాడు మరో దానిలో. తనకన్నా ముందు శరీరాన్ని వదిలే జీవన సహచరి పట్ల సహచరుడికి ఉండే అనురాగం ఆమె వెనకే ప్రయాణం కట్టించడానికి పురిగొల్పితే, అదే పరిస్థితి సహచరికి ఎదురైనప్పుడు తొందరపడొద్దని అప్పగింతలు పెడతాడు. గోదావరి జిల్లాల్లో మేనరికపు వివాహాలు ఎక్కువ, ఇలాంటి సందర్భాలలో పెళ్ళైన అమ్మాయికి అబ్బాయికి మధ్య వయసు అంతరం పెచ్చు. భార్య ఓపిగ్గా ఉన్నప్పుడే భర్త కాలం చేసే సందర్భాలలో గుండెపగిలి రాలిపోయే సన్నివేశాలు ఎన్ని చూసుంటాడో మరి. నిన్న మొన్నటి విషాదం శృంగవృక్షం మురళిని కోల్పోవడం, ఈ పుస్తకం ఆ రకంగా దూరమైన మిత్రులు జాన్ హైడ్ కి, అరుణ్ సాగర్ నీ మనసారా తలచుకోవడం, నివాళులు అర్పించడం.

వెనకటికి నాకు నాట్యం నేర్పిన గురువుగారితో కె.విశ్వనాథ్ గారికి రసవత్తర ముచ్చట జరిగింది. నాట్యాచార్య సప్పా దుర్గాప్రసాద్, వారి సూత్రధారులు చిత్రానికి నృత్య దర్శకత్వం చేస్తున్న సమయంలో సాగరసంగమం ముగింపు సహజంగా లేదని చెప్పిన సందర్భం. ఎలా అని విస్తూపోయిన కళాతపస్విని మిన్నకుండిపోయేటట్లు చేసిన ఈ జవాబు.. కళాస్వాదనలో మునిగితేలే కళాకారుడు ఎవరైనా అతడి జీవన వైఫల్యాలు కళకి అంకితమవ్వడానికే దోహదపడతాయి కానీ, అలవాట్లకు లొంగనివ్వవు. ప్రియురాలు దూరమైందని వ్యసనాలకు బానిసవ్వడం కళాకారుడి లక్షణం కాదు.. ఆ రకంగా ఆ కళాఖండం ఒరవడి హేతుబద్ధం కాదని. అది నిజమని నిరూపించేందుకు వర్మ సిద్ధం. ఏ

మత్తూ తనని చిత్తు చేయలేదని కనుగొన్నాకే కవిత్వం పట్టి 'కృషి' చేస్తున్నాడు.

గోదారోడికి మొక్కని పెంచడాన్ని మించిన కళ ఏముంటుంది!. అందుకే కష్టాలకు కవిత్వాన్ని అంటుకట్టి జీవితాన్ని ఫలప్రదం చేసుకుంటున్నాడు. నీరెండలో తన పాదాలకి మట్టి కనబడని రోజు లేపాలని ప్రయత్నించవద్దని తడిమి చెబుతున్నాడు.

*దుఖాఃనికి సంతోషానికి వ్యత్యాసం.. పుట్టుకకి చావుకి నడుమన దూరం.*
*నిద్ర పట్టిన ప్రతీ రాత్రీ ఒక మరణం.. మెలుకువ వచ్చిన ప్రతి వేకువా ఒక జననం*

పోయేలోగా ఒక జీవితం జీవించి చూపాలని తపన తో నిత్యం బ్రతికే వాడికి కొన్ని విరహాలు, కొన్ని సరసాలు అన్ని కవిత్వమై సమకూరుతాయి. మంచితనంతో కూడిన అల్పసంతోషికి దైవభక్తితోడైతే తనకేవమైనా మిగుల్చుకుంటాడా! ఏడుకొండలవాడ్ని చూడగానే పడ్డకష్టం అంతా మరచి.. పెరట్లో కొబ్బరి, చెట్టు పొలాన పసిడి పంట,, ఆదేవుడి చ్చినదే అంటాడు. ఈ సిరి తండ్రీ–తల్లీ తండ్రీ ఆలీ బిడ్డా అంతా నీదే... అంటాడు ఒదిగి ఉండే తత్వం లోని గొప్పదనం, పంట వరదల్లో కొట్టుకుపోయినా ఇదే తత్వం. తెచ్చిన, తెంచినా గోదారే దిక్కు మాకు.

ఈ నీరు తాగి పెరిగినోడికి ఒక ప్రత్యేకత ఉంటుంది. అది పలకరింపులోనే కాదు, పులకరింపులో కూడా! లోకం సమస్తం చల్లగా ఉండాలని పచ్చదన్నాన్ని తనతో కలిపి పంచే కళాకారుడయ్యాడు కలిదిండి వర్మ. ఇదంతా ఎందుకు అంటే ఉద్వేగాల్లో చిప్పిల్లే తడికోసం, అది పంచుకోవడం కోసం, ఓడిపోయినా పర్వాలేదు మనసారా నవ్వగలగడం కోసం, ఏడుపును పంచుకోవడం కోసం. గోదారిప్రాంతం పలకరింపుకే కాదు అతిథి మర్యాదలకి పెద్దపేరు. డొక్కాసీతమ్మలు రెండు గట్లమ్మటా పలకరించే అరటి చెట్లల్లే ఆకుల్ని పరుస్తారు. ఇంటికి రాగానే ఎదురొచ్చే మజ్జిగ గ్లాసూ, కొసరి వడ్డించే ఔదార్యం, కడుక్కోగానే చేతికి అందిచే తుండు, మళ్ళీ మాట్లాడుకోవాల్సిందే.. సున్నాని అరువు తెచ్చుకొని జీవితాన్ని పరిపూర్ణం చేసుకోవాలనే తపన వర్మ అక్షరమక్షరం కనిపిస్తుంది. అడపా దడపా కాదు తడిమితే గడపగడపకీ, వర్మ కవిత్వంలో చూపించిన సత్యవతమ్మలు, సాధనాల తాతయ్యలు, గుండెత్తు రాళ్ళని మోసే మొనగాళ్ళు, దిల్కుష్, మహారాజా రంగాలు, గోరింటాకు పెట్టే పాపత్తలూ, చేతులెత్తి దండం పెట్టాలనిపించే లైలమ్మలూ, వెంకటేశ్వర రావు మాస్టారు, కూరగాయలు అమ్మటానికి వచ్చే సావిత్రమ్మ, పెంకుటిళ్ళు,

పండగ పందిళ్ళు, తాడిచెట్లు మీకెక్కడైనా తారసపడొచ్చు. వర్మ కవిత్వం చదివాక మీ చుట్టుపక్కలా ఉన్నారని, పండగలాంటి మనుషులు అన్నిచోట్లా ఉంటారని గుర్తిస్తారు. మీరే దేశాన ఉన్నా, ఈ పుస్తకాన్ని చేతుల్లోకి తీసుకుని పేజీ పేజీనీ పలకరిస్తూ పొండి. మీ చుట్టుపక్కల ప్రాంతమంతా చెరువుగట్టు అవుతుంది, మీ మనసు వరద గోదారి అవుతుంది. మీ అంతట మీరే తడికళ్ళు తుడుచుకుంటూ ఈ పుస్తకాన్ని అక్కున చేర్చుకుంటారు.

గోదారంటే సస్యశ్యామల తీరం మాత్రమే, మర్యాదలకే పెటిందిపేరు ఒక్క మాటా తూలని నిశబ్ధం.. అనుకునేరు గిరిజనపోరాటాలకోసం ఎగరేసిన ఎర్రని జెండా, పోలవరం నిర్వాసితుల హక్కుల కోసం ఊదిన కొమ్ము బూర, పోడుకోసం, తునికాకు రేటుకోసం కన్నీరైన కొడవలి. చేపల చెరువులు ఒబ్బిడి కానప్పుడు తిరగబడ్డ నాగలి, ఇప్పుడు కాలుష్య కోరలునుంచి నదీ జలాల్ని రక్షించాలని కత్తిపీట పైకెత్తి గొంతేరు మహిళలు చేస్తున్న ఉద్యమం. అందుకే ఈ కళ్ళన సింగరేణి కార్మికుడి బాధా, నిర్భయ వేదనా, గోదారి పరవళ్ళు తొక్కినట్టు అరుణ సాగరమై పోటెత్తుతుంది.

మనమందరం నదికి పుట్టాం, వివిధరూపాల్లో ప్రవహిస్తాం అన్నాడు వర్మ వేలికొసన.. అక్షర రూపంగా. అది నిజం చేసేందుకే గోదారి పలకరింపుని గొంతెత్తుకున్నాడు. ఎవరు జీవిస్తే అనేకులు జీవిస్తారో అదే అసలైన జీవితం – ఎందరిని బతికించాలనో నది పారుతుంది, అనేకానేక జీవితాలలోంచి నిజంగా బ్రతికిన క్షణాలు ఇలా కవిత్వంగా మలచబడ్డాయి.

గోదారిపలకరింపు ఎప్పటికీ ఒక భద్రపరచబడ్డ జ్ఞాపకమై కవిత్వంలో మిగులుతుంది.

**–యశస్వి**